వరద పెరిగితే దడే..

- బొబ్బిల్లంక వద్ద బలహీనపడిన ఏటిగట్టు
- గండి పడే ప్రమాదం
- ఆందోళనలో రైతులు, ప్రజలు



రాపాక వద్ద ముంపులో ఉన్న వరి పొలాలు



బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

సీతానగరం: గోదావరికి వరద వస్తే మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మునిగిపోతున్న పొలాలను, రోడ్లతో పాటు బలహీనంగా ఉన్న ఏటిగట్టును చూసి ఆవేదన చెందుతున్నారు. ఈ సీజన్‌లో గోదావరి దాదాపు మూడుసార్లు వరద నీటితో పోటెత్తి ప్రవహించింది. ఏటిగట్టును అనుకుని ఉధృతంగా ప్రవహించింది. ముఖ్యంగా బొబ్బిల్లంక వద్ద గండి పడుతుందేమోనని ప్రజలు, అధికారులు ఆందోళన చెందారు. అలాగే గోదావరి వరదతో పలుమార్లు పంట పొలాలను ముంపునకు గురయ్యాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టు బలహీన పడింది. ఆ ప్రాంతంలో రక్షణ చర్యలేమీ చేపట్టలేదు. అలాగే గోదావరిలో వరద నీరు పెరగడంతో బొబ్బిల్లంక వద్ద స్లూయిజ్ డోర్లు మూసుకుపోయాయి. దీనితో కొండ గోదావరి ఎగపోటుతో మూడుసార్లు పొలాలు ముంపులోకి వెళ్లిపోయాయి.

వరద కష్టాలు

గోదావరికి మొదటి సారి వరద వచ్చిన సమయంలో సీతానగరం మండలంలోని 8 వేలు, కోరుకొండ మండలంలో 3 వేల ఎకరాలు ముంపులోకి చేరుకున్నాయి. అప్పటి నుంచి సీతానగరం మండలంలో రెండు వేలు, కోరుకొండ మండలంలో వెయ్యి ఎకరాలు ముంపు నుంచి బయటపడలేదు. ఇప్పుడు మరోసారి పొలాలు మునిగిపోయాయి. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్‌లో వరిసాగు చేయడం ఇక అసాధ్యమని, ఇక దాళ్వాలో ఆరుతడి పంటలు వేసుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఇక కౌలుకు పొలాలను తీసుకుని సాగు చేస్తున్న రైతుల పరిస్థితి దారుణంగా మారింది. అందిన కాడికి అప్పులు తెచ్చి వరి సాగు చేపట్టగా, పొలాలన్నీ ముంపులోకి చేరుకున్నారు. వరినాట్లు వేసిన తర్వాత మొదటిసారి ముంపులోకి వెళ్లిన పొలాలకు నష్టపరిహారం అందించే దిశగా వ్యవసాయశాఖ నివేదిక అందించింది. అయినప్పటికీ ఇంతవరకు దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

భయాందోళనలో ప్రజలు

గోదావరి వరద ఉధృతంగా రావడంతో బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టు కోతకు గురైంది. ఆ గట్టును అనుకుని గోదావరి ప్రవహిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఏటిగట్టు కోతకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఏటిగట్టు రక్షణకు రాక్ స్టోన్స్ వేయడానికి సిద్ధపడినా, ఆ పనులు ఎందుకో జరగలేదు. గోదావరి వరదతో ఏటిగట్టుకు గండి పడితే సీతానగరం, కోరుకొండ, గోకవరం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల గ్రామాలు ముంపులోకి వెళ్లే అవకాశం ఉంది. ఈ వరద నీరు బొబ్బిల్లంక స్లూయిజ్ ద్వారా గోదావరిలో కలవడానికి సుమారు నెల రోజులు పడుతుంది.

గండి పడితే ముంపులోకి..



ఏటిగట్టు గట్టుకి గండి పడితే పలు గ్రామాలు ముంపులోకి వెళతాయి. విజయవాడలో ఇటీవల వచ్చిన వరదతో అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు అందరికీ తెలిసినవే. ఏటిగట్టుకు గండి పడితే ప్రాణనష్టం కూడా జరిగే అవకాశం ఉంది. బొబ్బిల్లంక వద్ద ఏటిగట్టు బలహీనపడింది. అక్కడ ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ప్రజల భయాందోళనలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

– అంబటి రాజు, మునికూడలి

ముంపులోనే పొలం



మొత్తం ఐదు ఎకరాల్లో వరి పంట వేశాను. వాటిలో మూడు ఎకరాలను కౌలుకు తీసుకున్నాను. ముంపులోకి వెళ్లితే రెండోసారి వరినాట్లు వేశాను. ఇప్పుడు మూడోసారి పొలం ముంపులోకి వెళ్లింది. వేసిన పంట మొత్తం పాడైంది. మళ్లీ నాట్లు వేయడానికి వరి ఆకు కూడా అందుబాటులో లేదు. ఎకరానికి రూ.35 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. అదంతా నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కొమ్మిరెడ్డి రాము, లంకూరు

క్లుప్తంగా

స్టాక్ ఇసుక తరలింపు



కాటవరం ర్యాంపు వద్ద ఇసుకను లారీలోకి లోడ్ చేస్తున్న సిబ్బంది

సీతానగరం: మండంలోని కాటవరం ర్యాంపు వద్ద స్టాక్ ఉంచిన ఇసుకను రాజమహేంద్రవరం కార్పొరేషన్ అభివృద్ధి పనులకు తరలించారు. ఈ మేరకు శనివారం ఉదయం కాటవరం ర్యాంపుకు 30 లారీలను తీసుకువచ్చారు. సీతానగరం డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్ఐ లక్ష్మి తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని, లారీలపై ఇసుక లోడింగ్‌కు అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ స్టాక్ ఉంచిన ఇసుక 2,870 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. టన్ను రూ.420కు రాజమహేంద్రవరం కార్పొరేషన్ అభివృద్ధి పనులకు తరలిస్తున్నారన్నారు.

వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

రాజానగరం: మండలంలోని రాధేయపాలెంలో వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా సర్పంచ్ నురుకుర్తి దుర్గ ప్రారంభించారు. గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీమృదుల పర్యవేక్షణలో స్త్రీలకు సంబంధించిన వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

పెదపూడి: మండలంలోని సంపర వేంకటేశ్వర స్వామి ఆలయంలో భాద్రపద మాసం శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

గంగమ్మ ఒడిలోకి గణనాథుడు



పందలపాకలో గణపతిని నిమజ్జనం చేస్తున్న మహిళలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో వెలంపేట ఉసిరి చెట్టు గణపతి మంటపం వద్ద కొలువైన శ్రీబాల గణపతి నిమజ్జనం శనివారం ఘనంగా నిర్వహించారు. గత ఏడు రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడిలోకి చేరుకున్నాడు. తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పుల నడుమ వినాయకుడిని ఊరేగించి గౌరిశంకర ఆలయం వద్ద ఉన్న తుల్య భాగ నదీ తీరంలో నిమజ్జనం చేశారు. అనంతరం శనివారం స్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిపారు.

18, 19 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికలు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని డీఆర్‌కే రెడ్డి కాలేజీలో ఈ నెల 18, 19 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నారని ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బి.వెంకటగిరి తాతరాజు తెలిపారు. శనివారం వారు పెదపూడిలో మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, చెస్, యోగ, త్రోబాల్ తదితర క్రీడల్లో 18న బాలురు, 19న బాలికలకు ఎంపికలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 94406 69946 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన సింగంపల్లి గ్రామస్తులు కొండేపూడి భూషణం, కొండేపూడి పుష్పవతిలకు 25 కేజీల బియ్యం, పప్పులు, కూరగాయలు తదితర నిత్యావసర సరకులు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ నాయకులు పాల్గొన్నారు.

గణపతిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



అనపర్తిలో వరసిద్ధి వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: అనపర్తిలో బాపనమ్మ యూత్ నెలకొల్పిన వరసిద్ధి వినాయకుడిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జి.మామిడాడ గ్రామం శివారు ఎల్ఎస్‌పురంలోని మెరక వీధిలో బాలగణపతిని, అదే గ్రామంలో రైతులు నెలకొల్పిన వరసిద్ధి వినాయకుడిని సైతం దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో మల్లిడి వీరరాఘవరెడ్డి, కొవ్వూరి వెంకటరామారెడ్డి, చిన్నం వీరరామారెడ్డి, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, కేతా శ్రీను, వానపల్లి గణేష్, కొత్తూరు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



ఉచిత హోమియో శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్యామ్‌కుమార్ వైష్ణవ్

రంగంపేట: మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమరనాథ్ పర్యవేక్షణలో రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ శ్యామ్‌కుమార్ వైష్ణవ్ వైద్య సేవలు అందించారు. శిబిరంలో 30 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోతుల శివ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలోని వెలంపేట వద్ద కొలువైన శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారధన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ముందుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు.

సరస్వతీ మాతకు పూజలు

రాజానగరం: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా కంచుపట్ల రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపంలో శనివారం రాత్రి చిన్నారులతో సరస్వతీమాతకు ప్రత్యేక పూజలు చేయించారు. ఇక్కడ ఉత్సవాలను ఆదివారం ముగియనున్నాయి. అనంతరం వినాయకుడిని నిమజ్జనం చేస్తారు.

సిద్ధి వినాయకుడికి పంచామృతాభిషేకాలు



సంపర వరసిద్ధి వినాయక ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదపూడి: మండలంలోని సంపర సిద్ధి వినాయక స్వామి ఆలయంలో గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఏకాదశి శనివారం సందర్భంగా ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, గరిక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉండ్రాళ్లు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి పూజల్లో పాల్గొన్నారు.

జి.మామిడాడలో..

జి.మామిడాడ గ్రామంలోని బల్ల మేస్త్రి నాగిరెడ్డి బల్లపందిరి మంటపంలో గణపతికి లక్ష్మీగణపతి హోమం, గరిక పూజ చేశారు. పలువురు దంపతులు యజ్ఞకర్తలుగా పూజల్లో కూర్చున్నారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలో హోమం చేశారు. కార్యక్రమంలో నల్లమిల్లి భూలోకరెడ్డి, నల్లమిల్లి అయ్యప్పరెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, కొవ్వూరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రక్ ఆటోలోంచి జారిపడి బాలిక మృతి

సీతానగరం: ట్రక్ ఆటోలోంచి కింద పడి జాలిమూడికి చెందిన ఉర్ల లక్ష్మి రూపాకుమారి (12) మృతి చెందింది. ఎస్సై డి.రామ్‌కుమార్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జాలిమూడికి చెందిన లక్ష్మి రూపాకుమారి కాటవరం స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పాఠశాల ముగిసిన తర్వాత కాటవరంలో ట్రక్ ఆటో వస్తుండగా లిఫ్ట్ అడిది ఎక్కింది. అయితే కాటవరం రైస్ మిల్లు టర్నింగ్ వద్ద అదుపు తప్పి ట్రక్ నుంచి కింద పడింది. ఈ ఘటనలో బాలిక తలకు తీవ్ర గాయం కావడంతో అదే ట్రక్ ఆటోలో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలిక చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 7 గంటలకు మృతి చెందింది. తండ్రి ఉర్ల వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిరంతరం పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి



మేథ ముగింపు సభలో మాట్లాడుతున్న అభిషేక్ దోయ్ఫోడే

రాజానగరం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు పరిజ్ఞానాన్ని పెంచుకుంటేనే ఆయా వృత్తులలో రాణింపు ఉంటుందని వర్ట్యూస్ ఇండియా క్యాంపస్ హెడ్ అభిషేక్ దోయ్ఫోడే అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో రెండు రోజుల పాటు జరిగిన మేథ సాంకేతిక ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని, దేశ ప్రగతిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. యువ ఇంజినీర్లలో భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు సమృద్ధిగా ఉండాలన్నారు. తాము ఉద్యోగాలు చేసే సంస్థల గురించి, విదేశాల్లోని క్లయింట్లతో మాట్లాడేందుకు వీలుగా భాషా ప్రావీణ్యం అవసరమన్నారు. అలాగే అడ్వాన్స్ కోడింగ్‌పై పట్టుసాధించాలని సూచించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలలో పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్లు, ప్రాజెక్టు ఎక్స్ పో, ఇంట్రాక్టివ్ వెబ్ డిజైనింగ్, హేక్ థెన్, రోబో రేస్, టెక్నికల్ టాక్స్, టెక్నికల్ క్విజ్, ట్రెజర్ హంట్ వంటి పలు కార్యక్రమాలు జరిగాయి. డాక్టర్ బి.సుజాత, తమిళకోడి కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

పుష్కరాల నాటికి గోదావరిని శుభ్రం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: 2027 పుష్కరాల నాటికి గోదావరి జలాలను స్వచ్ఛంగా తయారు చేసేందుకు నగరపాలకసంస్థ చర్యలు చేపట్టాలని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం పుష్కరఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వినాయక నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని మట్టి విగ్రహాలకు పూజలు చేయడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. వచ్చే ఏడాది 90 శాతం మంది మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు గోదావరి పరిరక్షణ సమితి తరఫున కృషి చేస్తామన్నారు. మట్టి విగ్రహాలను మాత్రమే గోదావరిలో నిమజ్జనం చేయడానికి అనుమతించినప్పుడే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగం తగ్గుతుందన్నారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత స్నానఘట్టాలను శుభ్రపరచడంతో పాటు నదిలో పేరుకుపోయిన చెత్త, బురద మట్టిని కూడా శుభ్రపర్చాలని సూచించారు. గోదావరిని శుభ్రపరచేందుకు స్థానిక మత్స్యకారులు సిద్ధంగా ఉన్నారని, వారికి ఖర్చుల కోసం కొంత కేటాయించేందుకు కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో తామే శుభ్రపర్చడానికి చర్యలు చేపడతామన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే క్రమంలో పేపర్‌మిల్లు నుంచి విడుదలయ్యే నీటిని ధవళేశ్వరం బ్యారేజీ దిగువున విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తినప్పటికీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పైసా రాల్చకపోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు సమర్థవంతమైన ముఖ్యమంత్రి అయితే వరద నష్టం కింద కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు సాధించి తీసుకురావాలన్నారు. సమావేశంలో భద్రరావు, పట్నాయక్, ఎస్‌వీ రెడ్డి పాల్గొన్నారు.

హిందీ భాష దేశ ఐక్యతకు చిహ్నం

బిక్కవోలు: హిందీ భాష దేశ ఐక్యతకు చిహ్నమని, జాతీయ భాష అంటే దేశం మొత్తం మాట్లాడే భాష అని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. శనివారం పాఠశాల వద్ద హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం 1949లో హిందీ భాషను జాతీయ భాషగా ప్రకటించిందన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం హిందీ నేర్చుకోమని విద్యార్థులకు సూచించారు. ప్రపంచంలో 150 యూనివర్సిటీల్లో హిందీని బోధిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో మనుగడకు మార్గం సుగమం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వరరెడ్డి, మహమ్మద్ వలీషా, అప్పారావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కూడలి ప్రాంతాల పరిశీలన



గైట్ కాలేజీ కూడలిని పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

రాజానగరం: జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వరకూ ఉన్న కూడలి ప్రాంతాలను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిషోర్ శనివారం రాత్రి పరిశీలించారు. దివాన్ చెరువు, గైట్ ఇంజినీరింగ్ కాలేజీ, చక్రద్వారబంధం, సూర్యారావుపేట కూడళ్లను సందర్శించారు. ఆయా ప్రాంతాలలో ప్రమాదాలకు తావిస్తున్న కారణాలను అధ్యయనం చేశారు. నివారణా చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. వారి వెంట రాజానగరం, బొమ్మూరు పోలీసు అధికారులు ఉన్నారు.

కడియం: జాతీయ రహదారిపై జిల్లా పరిధిలో ఉన్న బ్లాక్ స్పాట్‌లను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిశోర్ శనివారం రాత్రి పరిశీలించారు. కడియం మండలం పరిధిలోని పొట్టిలంక, కడియపులంక, బుర్రిలంక, వేమగిరి ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పరిశీలించారు. జాతీయ రహదారులపై తరచు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి, అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై స్థానిక అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచికలను ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేయాలన్నారు.

పోస్టల్ విశ్రాంత ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న పోస్టల్ విశ్రాంత ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ శాఖలో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు ఎస్ఈఎస్ సత్యనారాయణ, కార్యదర్శి రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. రైళ్లలో సీనియర్ సిటిజన్లకు రాయితీలను పునరుద్ధరించాలని, 8వ వేతన సంఘం సిఫారసులు అమలు చేయాలని, 18 నెలల డీపీ బకాయిలు చెల్లించాలని, పింఛనుదారులకు 65 ఏళ్లు వచ్చిన వెంటనే అదనపు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మరాజు, చంద్రశేఖరరావు, సూర్యారావు పాల్గొన్నారు.

క్రీడల్లో అదరహో..

- సత్తా చాటుతున్న నగర విద్యార్థులు
- వివిధ పోటీల్లో పతకాల కైవసం



వెయిట్ లిఫ్టింగ్‌లో సాధించిన పతకాలతో జూహిత గుణ

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం అనగానే గలగలపారే గోదావరి, విద్యాసంస్థలు, చారిత్రక కట్టడాలు, కవులు, సాహితీవేత్తలు, సంఘ సంస్కర్తలు గుర్తుకువస్తారు. ప్రస్తుతం వీరితో పాటు క్రీడాకారులు కూడా పరిచయం అవుతున్నారు. సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరం విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణిస్తున్నారు. వివిధ రకాల జాతీయ పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. అయితే వీరందరూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు కావడం గమనార్హం. క్రీడలపై ఆసక్తితో తమ ప్రతిభకు పదును పెట్టి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించి, అనేక పతకాలు కైవసం చేసుకుంటున్నారు. అంతర్జాతీయ క్రీడా పోటీల వేదికలపై సత్తా చాటుతూ రాజమహేంద్రవరం ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేస్తున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్‌తో పాటు కరాటే, కిక్ బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఊషు వంటి ఆత్మరక్షణ క్రీడాల్లోనూ సత్తా చాటుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం

లాలా చెరువు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జుహిత గుణ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించింది. అనకాపల్లిలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకూ జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్ కేటగిరీలో 71 కేజీల విభాగంలో ప్రథమ స్థానాలు సాధించి బంగారు పతకాలు కైవసం చేసుకుంది. కోచ్ యాళ్ల భాస్కరరావు శిక్షణలో తల్లిదండ్రులు దేవీప్రసాద్, పార్వతీ వరలక్ష్మి ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించినట్లు జూహిత గుణ తెలిపింది. ఆమె తల్లి సచివాలయం మహిళా పోలీస్‌గా, తండ్రి ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో వరల్డ్ యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనడమే తన ఆశయమని జూహిత చెప్పింది. ఆమె హిమాచల్‌ప్రదేశ్‌లో అక్టోబర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఇంతటి ఘన విజయం సాధించిన జూహితను లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, పాఠశాల ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.